# అక్టోబర్ రెండు

ధృతరాష్ట్రుడు : అధర్మక్షేత్రే... గురుక్షేత్రే... సమవేతా యుయుత్సవా... మామకా అగ్రజశ్చైవ... కిమకుర్వత సంజయః...

జ్వరం వచ్చిందని చెప్పి ఒక వారం రోజుల నుండీ నీవిక్కడకు రాలేదు. అందువల్ల ఈ వారం రోజులుగా ఎటువంటి వార్తలు నాకు తెలియలేదు. ఇహ ముందు ఇటువంటి రోగాలేవీ తెచ్చుకోకుండా చూసుకొనే బాధ్యత నీదే. ఉదయం తిండి లేకపోయినా నాకు ఫర్వాలేదు. కానీ వేడివేడి వార్తలు వినకపోతే నేను తట్టుకోలేను. మరెటువంటి కాలయాపన చేయకుండా నీ ఉవాచ ఆరంభించు.

సంజయుడు : ఎటువంటి వ్యాధులూ నన్ను సోకకుండా అవసరమైన విటమిన్స్‌ను వాడుతూనే ఉన్నాను. అయినా ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక జబ్బు రావడం సహజమే. ఎప్పుడైనా నేను రాకపోయినప్పుడు తమకు వార్తలు చేరటానికి ఆటంకమేదీ ఏర్పడకుండా ఒక చిన్న టి.వి. కొనుక్కొని ఉంచుకోవడం శ్రేయస్కరం. టీ.వీ. ప్రోగ్రాం వినే మీరు అవగాహన చేసుకొంటారు కాబట్టి ప్రత్యేకించి కలర్ టీ.వి. అవసరముండదు. బ్లాక్ అండ్ వైట్ అయినా సరిపోతుంది. ధర కూడా దానికి తక్కువే.

ధృతరాష్ట్ర : మరందులో చతుర్దశ భువన సమాచారమంతా వస్తుందా?

సంజయుడు : మానవుడు గ్రహించిన ముఖ్య విషయాలన్నీ ఇందులో ప్రసారమవుతాయి. ఆశ్చర్యకర విషయం ఏమిటంటే ఈ వార్తల్ని చేరవేయటానికి భూమిచుట్టూ కృత్రిమ ఉపగ్రహాల్ని కూడా ప్రవేశపెట్టారట!

ధృతరాష్ట్ర : ఏమిటీ? కృత్రిమ ఉపగ్రహమా?

సంజయుడు : పరిహాసం చేస్తున్నారా మహారాజా; ఏమైనా పుడమిలోని కొందరు ప్రేక్షకులు ఈ విధంగానే చెప్తుంటారు లెండి. సరే, ఒక బ్లాక్ అండ్ వైట్ టి.వి. కొనటానికి ఏర్పాట్లు చేయనా మహారాజా?

ధృతరాష్ట్ర : వలదు... వలదు... మనము ఒక బ్రహ్మాండమైన కలరు టి.వి.నేటి కొందాము. చూపులేదు కాబట్టి నాకేదైనా సరిపోతుంది. కానీ కురుక్షేత్రానంతరం కళ్ళకట్టు తీసివేసిన గాంధారికి ఈ రంగుల టీ.వి.యే ఆనందం కలిగిస్తుంది. అంతేగాక వచ్చిన సందర్శకులు బ్లాక్ అండ్ వైట్ టి.వి.ని చూసి నన్నొక పిసినారిగా జమకడతారు. ఏది ఏమైనా నా మనోనేత్రం ముందు ఒక టి.వి. చూసిన అనుభూతి కల్గించటానికి నీకొక్కడికి సాధ్యమవుతుంది. టి.వి.ని చూసినా విన్నా, ఏమైనా సందేహాలొస్తే అడిగి సమాధానాలు తెల్సుకోవడం సాధ్యపడదు కదా! ఆ విషయమట్లా ఉంచు; గత కొంత కాలంగా భువిలో జరుగుతున్న విశేషాలేమిటో నీవు వివరించు సంజయా?

సంజయుడు : భూమి అంతటా ఎన్నెన్నో సంఘటనలు జరిగిపోతున్నాయి; కానీ తమకు భారతంలో జరిగే విషయాలను వినటం పట్లనే గదా ఆసక్తి? అవి వివరించడానికి కూడా ఎన్నో దివారాత్రాలు అవసరమవుతాయి. అందుకని అత్యంత ఉత్సాహకరమైన కొన్ని సంఘటనలను పంచుకోవటానికి తమరి అనుమతి నాకు కావాలి.

ధృతరాష్ట్ర : అట్లాగే; దక్షిణ భారత విశేషాలేమిటో ముందు తెలియజేయి.

సంజయుడు : కేరళ, కర్నాటక, తమిళనాడు అనే ప్రాంతాలలో ప్రత్యేకమైన విశేషాలేమీ ప్రస్తుతానికి లేవు. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో అందరు ప్రముఖ దేవతా వేషాలు ధరించి ప్రసిద్ధి చెందిన ఒక వ్యక్తి ఉన్నాడు.

ధృతరాష్ట్ర : నీవు అన్వయించబోయేది సాక్షాత్తు ఎన్.టి. రామారావు గురించే కదా! దానవీర శూరకర్ణ అనే చిత్రంలో ఎన్నో వేషాలు అతను ధరించాడట కదా!

సంజయుడు : జ్ఞాపకశక్తే కాదు, తమరిలో జ్ఞానం కూడా అపారం. మరోసారి వారు అక్కడ ముఖ్యమంత్రి అయినారు; అదే ఇప్పటి ముఖ్య వృత్తాంతం.

ధృతరాష్ట్ర : లోగడ గూడా ఆరేడు సంవత్సరాలు ఈ పదవినే ఆయన అధిష్టించి ఉన్నారు గదా!

సంజయుడు : మళ్ళీ ఆయన పదవిని చేపట్టడం జరిగింది; ఈసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన చేసిన మొదటి పని ఏమిటో తెలుసా?

ధృతరాష్ట్ర : నీవు చెప్పందే నాకు ఎట్లా తెలుస్తుంది? ఉత్సాహం కల్గించేదైతే ఆ వార్తేమిటో వెంటనే విన్పించు.

సంజయుడు : ఆయనిచ్చిన మొదటి ఉత్తరువు ఏమిటంటే ఆంధ్రప్రదేశ్‌లో ఏ ఒక్కరూ మద్యపానం చేయగూడదని.

ధృతరాష్ట్ర : అంటే... అక్కడి మనుష్యులు సంతోషం కోసం ఎటువంటి సురాపానీయం పుచ్చుకోగూడదనా నీవు చెప్పేది? అయితే ఎవరైనా ఎప్పుడైనా ఇంతమందు కొట్టి ఆ మత్తు అనుభవాన్ని పొందాలనుకొంటే మరి వాళ్ళేం త్రాగాలి?

సంజయుడు : అటువంటి వాళ్ళకు తేనీరు, కాఫీ, పాలు, పెరుగు, మజ్జిగ, నిమ్మరసం త్రాగటానికి సంపూర్ణ స్వాతంత్ర్యం ఉంది.

ధృతరాష్ట్ర : అన్ని బాధల్నీ మర్చిపోయి, ఆనందలోకంలో విహరించటానికి అవసరమైన సురాపానం చేసే స్వాతంత్ర్యం గూడా వాళ్ళకు లేదా?

సంజయుడు : భారతంలో కొన్ని ప్రాంతాల్లో, కొన్ని సమయాల్లో కొందరు వ్యక్తులు దీనిని మితిమీరిన స్వేచ్ఛగా పరిగణిస్తారు. మద్యపానం అధికంగా తీసుకోవటం వల్ల ఎన్నో కుటుంబాలు సర్వ నాశనమైపోయినాయి.

ధృతరాష్ట్ర : అమితమైతే అమృతం గూడా విషమవుతుంది. దేనినైనా పరిమితికి మించకుండా మితంగా తీసుకొనే ఆత్మ నిగ్రహ స్వభావం ఈ మానవులకు లేదా? ఎవరిలోనైనా ఈ గుణం కొంత లోపిస్తే అతనిలో ఈ లక్షణాన్ని పెంచి పోషించవలసిన బాధ్యత తల్లిదండ్రులకు గానీ, గురువులకు గానీ, భార్యకు గానీ, మిత్రులకు గానీ ఉండదా? నియమ నిబంధనలూ, చట్టాలూ ఇవన్నీ గూడా మానవులకు ఆత్మసంయమనానికి తోడ్పడతాయి. ప్రభుత్వమనే నియంత్రణ యంత్రాంగాన్ని గూడా సమర్థవంతంగా పనిచేసేట్లు చూడాలి. ఇట్లాకాకుండా ఎవరో కొందరు ఒక వస్తువును అమితంగా వాడుతున్నారని, అందరు మానవులు ఇహ దానిని ఉపయోగించరాదని నిషేదం విధించడం మాత్రం అసమంజసం. కాని ఆ జలమే అధికమైతే అందులో మునిగిపోవడం జరుగుతుంది. ఈ కారణంగా మానవులెవ్వరు నీటిని వాడగూడదన్న నిబంధనను విధిస్తే వెర్రి తనంగాక మరేమిటి? నిప్పు ప్రమాదం కల్గిస్తుందని, మనిషి ఇహ

నిప్పునే ఉపయోగించరాదనటం హేతుయుక్తమేనా? సరే; ఈ విషయాలిట్లా ఉంచు; ఆహారం ఎక్కువగా తీసుకుంటే మనిషికి అజీర్తిచేస్తుంది. లేదా కాలం గడిచిన కొద్ది లావును పెంచుతుంది. భారతంలో ఎక్కువమంది తిండిపోతులే. ఇట్లా నియమాలు లేకుండా తిండి తినటంవలన శరీరంలో కొవ్వు అధికమై చాలా మంది వార్ధక్యానికి ముందే గుండెపోటుతో అకాల మరణం చెందుతున్నారు. దీనిని సాకుగా తీసుకొని మానవులెవ్వరూ భోజనమే చేయగూడదనటం అర్థరహితం కాదా?

సంజయుడు : మహారాజా! మన్నించలి; మీరు చెప్తున్న ఉదాహరణలేవీ ఇక్కడ అన్వయించవు; ఎందుకంటే, నీరు, నిప్పు, తిండి వలె మద్యం మానవులకు తప్పనిసరి కాదు.

ధృతరాష్ట్ర : సెహభాష్... సంజయా... నీవు చెప్పేదీ వాస్తవమే. నాకు కలిగినంతమంది సంతానం సాధారణ మానవులకు ఉండగూడదు కదా! పెద్ద కుటుంబంవల్ల ఎన్ని ఇక్కట్లు, ఇబ్బందులు ఎదురవుతాయో అందరికీ తెలుసు. అయితే మాత్రం ఈ కారణం చూపి ఇద్దరు ముగ్గురే పిల్లలున్న దంపతుల శారీరక సంబంధాన్ని నిరోధించే శాసనం తెస్తామా? ఒక రాజ్యంలో పిల్లలు అధిక సంఖ్యలో ఉన్నారని, ఇహ వివాహాన్నే నిషేధిస్తామా?

సంజయుడు : మీరు చెప్పే విషయాలన్నీ సమంజసమే మహారాజా? అయితే నేటి మానవులకు, సంతాన నిరోధక మెలకువలెన్నో తెలుసు. అందువల్ల ప్రత్యేకించి ఈ విషయంలో ఎటువంటి శాసనాలూ అవసరంలేదు.

ధృతరాష్ట్ర : అట్లా మీతో అన్న వెర్రి వెధవ ఎవడు? భారతంలో చాలమంది సత్పురుషులు సంతాన నిరోధక మార్గాన్ని వాళ్ళకు వాళ్ళుగానే అనుసరిస్తారు. అయినా బుద్ధి పూర్వకంగా అధిక సంతానాన్ని కనిపారేసే వాళ్ళు అక్కడ మాత్రం లేరా? జనసంఖ్యను అదుపు దాటిపోనీయ కూడదన్న ఆలోచన అక్కడి ప్రజలందరికీ ఉండి ఉంటే ఎనభైకోట్లు పై చిలుకు జనాభా ఎట్లా ఉంది ఈనాడు? అందువల్ల ప్రజల సంక్షేమాన్నీ, ఆరోగ్యాన్నీ కోరే ఏ ప్రభుత్వానికైనా సంతాన నిరోధక విషయంలో అజమాయిషీ ఉండటం తప్పనిసరి.

సంజయుడు : ఈ విషయంలో తమకున్నంత స్వీయానుభవం ఇతరులు ఎవరికీ ఉండదు గదా?

ధృతరాష్ట్ర : భారత రాజ్యాంగంలో ప్రతి పౌరునికీ తనకు నచ్చిన పనిని చేపట్టే హక్కు ఉన్నది కదా! అయినా నిరుద్యోగ సమస్య ఎంతో భయంకరంగా ఉన్న విషయం గూడా నీకు తెలుసు. ఒక హక్కు మాత్రమే ఇచ్చి దానికి తగ్గ ఉపాధి మార్గం చూపలేకపోతే అది నిష్ప్రయోజనమే అవుతుంది. బ్రతికే హక్కు, పనిచేసే హక్కు ఇచ్చి గూడా జీవనోపాధి కల్పించలేని ప్రభుత్వం ఒక ప్రభుత్వమేనా? ప్రజలకు పని చేసే మార్గం చూపెట్టడం ఏ ప్రభుత్వానికైనా కనీస ధర్మం. ఏ ప్రభువైనా ప్రజలకు ఉద్యోగావకావాలు కల్పించటంలో విఫలుడైనప్పుడు ప్రక్క రాజ్యంతో అతడు యుద్ధమైనా చేయాలి. ఇట్లా జరిగినప్పుడు లక్షలాది మంది జనం వీరస్వర్గం అలంకరిస్తారు. ఇహ మిగిలిన వాళ్ళకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. మిక్కిలి పెద్ద సంఖ్యలో పురుషులు మరణించడం వల్ల సంతానోత్పత్తి గూడా చాలవరకు అదుపులోకి వస్తుంది.

సంజయుడు మహారాజా! ప్రక్క రాజ్యంతో యుద్ధం చేసే హక్కు, అర్హత ఒక్క అమెరికాకు తప్ప వేరే ఏ రాజ్యానికీ భూలోకంలో నేడు లేదు. అమెరికా అదుపాజ్ఞలకు లోబడే తమ తమ దేశాల పాలకులు పరిపాలించుకోవాలి. ఇటీవలి కాలంవరకూ ఎంతో శక్తివంతమైన రష్యా అనే దేశాన్ని యుద్ధం చేయకుండానే అమెరికా ముక్కలు ముక్కలు చేసింది. అమెరికాను ఎదుర్కోవాలంటే సద్దాం హుస్సేన్ లాంటి యోధులుండాలి. ఏదైనా ఒక దేశానికి ప్రక్క దేశంతో యుద్ధం చేయాలనిపిస్తే అందుకు ముందుగా అమెరికా అధ్యక్షుల వారి అనుమతిని పొందాలి. ఈ అనుమతి లభించటానికి అమెరికా విధించే మూడు షరతులకు ఆయా దేశాలు ఒప్పుకోవాలి; ఆ షరతులేమిటంటే, ఒకటి... అధిక జనాభాను అదుపులో ఉంచటానికే యుద్ధం తలపెట్టామనీ, రెండు... యుద్ధంలో అమెరికా యుద్ధ సామగ్రినే తాము ఉపయోగిస్తామనీ, మూడు.... యుద్ధానంతరం దేశపునర్నిర్మాణానికి అవసరమైన సమస్త వస్తువులను అమెరికా నుండే దిగుమతి చేసుకొంటా మనేది.. ఏ దేశమైనా తన సార్వభౌమాధికారాన్ని వినియోగించుకోవాలనుకొన్నప్పుడు ఈ షరతులకు తలవొగ్గటం తప్పనిసరి.

ధృతరాష్ట్ర : సాధారణంగా మానవులందరూ మద్యపానం పట్ల ఆసక్తి చూపుతారు; ఇహ రాజులైతే మద్యం స్వీకరించినప్పుడే దర్బారులో జరిగే సంగీత నాట్యకళా రసాస్వాదనను పొందగల్గుతారు. చేతిలో డబ్బునప్పుడు మనసులో కోరిక ఉన్నప్పుడు మానవులు మద్యపానం చేస్తే తప్పేమిటి వాళ్ళ వ్యక్తిగత విషయాల్లో ప్రభుత్వం గాని, మరెవరైనా గాని ఎందుకు జోక్యం చేసుకోవాలి?

సంజయుడు : ఆంగ్లేయుల్నుండి భారతీయులకు స్వాతంత్ర్యం సంపాదించి పెట్టిన పూజ్య బాపూజీ చెప్పిందేమిటంటే, మద్యం విషంతో సమానమని, చాలమంది దీన్ని అంగీకరించారు కూడా.

ధృతరాష్ట్ర : ఒక్క మద్యమేనా విషం? అమృతం విషం కాదా? అధికమైతే అమృతం కూడా విషమని మనందరికీ తెల్సిందే కదా? పాము విషం మహా భయంకరమైనది. దానినే అతి తక్కువ మోతాదులో తీసుకొంటే కుష్టురోగమైనా నిర్మూలన మవుతుందని గదా మన ధన్వంతరులు సెలవిచ్చేది. క్షీరసాగర మధన సమయంలో సాక్షాత్ శంకరుడే ఎంత అధికంగా పాము విషాన్ని స్వీకరించాడు! ఆయన మరణించాడా?

సంజయుడు : సరైన సమయంలో పార్వతీదేవి వచ్చి ఆయన పీక పట్టుకోవడం వలన ఇప్పటికీ ఆ నీలకంఠుడు సలక్షణంగా ఇద్దరు ఇల్లాం(డ్ర)తో విలాసంగా గడుపుతున్నాడు.

ధృతరాష్ట్ర : సంజయా... నీలో అనవసరంగా శృంగారరసం తన్నుకొస్తూ ఉంది. మేం మాట్లాడుతున్న విషయాన్ని ప్రక్కదారి పట్టించగూడదు. అనుకున్నదే కాని, విషం తాగకుండా పార్వతి మాత్రం శంకరుణ్ణి ఆపగలిగిందా? లేదు; దీన్నేమంటావు నీవు? మగవాడి వ్యక్తిగత స్వాతంత్ర్యమంటే ఇదే. ఆ విషం అతని ఉదరం వరకు పోతే ముప్పు వాటిల్లుతుందని ఆమె భావించి శంకరుని కంఠం దగ్గరే ఆపుచేసి నీలకంఠునిగా మార్చివేసింది. ఒక ధర్మపత్ని లక్షణం ఇది. భర్తకు నిషేధాలు విధించే భార్య గయ్యాళి అవుతుంది. అయితే భర్తకు ఎటువంటి హాని కలుగకుండా కాపాడు కోవటం సాధ్వి ధర్మం. అవరోధాలు కల్పించటం ఎవరికీ ఇష్టముండదు. ఒకపని చేయగూడదని ఆంక్ష విధించే బదులు ఆ విషయంలోని మంచి చెడులను గూర్చి అవగాహన కల్పించడం ఉత్తమం. సురాపానం

అనాదికాలం నుండీ మాకబ్బిన అలవాటు. ఇదేవిధంగా పాచికలాట గూడా మాకు వినోదక్రీడే; కానీ, ఇటీవలి కాలంలో భారతంలో ద్యూతంపై కూడా నిషేధం విధించారట! ఇది వాస్తవమేనా?

సంజయుడు : వాస్తవమే మహారాజా... ద్యూతం, మద్యపానాల వల్ల మానవలోకంలో ఎన్నో కుటుంబాలు నాశనమై పోయాయి.

ధృతరాష్ట్ర : కానీ ఆనాడు మేం ద్యూతం ఆడినంత ఘనంగా ఈనాడు మానవులెవ్వరూ ఆడలేకపోతున్నారే; ద్యూతక్రీడ అంటే రాజకుటుంబాలకు వేలంవెర్రిగా ఉండేది. ధర్మపరుడైన యుధిష్ఠిరుడు కూడా ద్రౌపదిని ఫణంగా పెట్టి ద్యూతం ఆడలేదా? ఈ రోజుల్లో మానవులు చాలా స్వల్పస్థాయిలో పందాలు కాస్తున్నారు. ద్యూతం, మద్యపానం, విషయం అనే ఈ మూడు ఆసక్తులు మానవులకు తోబుట్టువులే కదా! ఈ ఆసక్తులను అదుపులో ఉంచుకొన్నవాడే విశిష్టమైన మనిషి. తనకు తానుగా ఆత్మసంయమనం పాటించటానికి ఏ మనిషికీ ఎటువంటి అభ్యంతరం ఉండదు; కానీ, పరులు ఆధిపత్యం చూపుతూ ప్రజా జీవనంలో అతి తక్కువ నిబంధనలు విధించే ప్రభుత్వమే మేలైన ప్రభుత్వం. ప్రజలకు సర్వస్వాతంత్ర్యాలను ప్రసాదిస్తూ వాటిని ప్రజలు దుర్వినియోగం చేయకుండా పరిరక్షించడమే మంచి ప్రభుత్వ లక్షణం.

సంజయుడు : మహారాజా..... రాజులు పాలించే కాలంలో రాజు, మంత్రుల, ఉపదేశకుల సలహాలను స్వీకరించి పాలించటం జరిగేది. కానీ, భారతంలో నేడెక్కడా రాజుల పాలనే లేదు. అన్ని చోట్లా అమలులో ఉన్నది ప్రజాపాలనే. ఈ రోజుల్లో ప్రధానమంత్రి గానీ, ముఖ్యమంత్రి గానీ పరిపాలనా పరంగానే కాక వారి వారి పార్టీలకు గూడా అధిపతులే. వీళ్ళు చెప్పే మాటలన్నీ చట్టాలు కాకపోవచ్చు. కానీ వాళ్ళ అభిప్రాయాల్ని చట్టాలుగా రూపొందించటానికి ప్రజాప్రతినిధులు నిత్యం సంసిద్ధులై ఉంటారు. ఇందువలన ఈ అధినాయకుల వ్యక్తిగతమైన అభిప్రాయాలనే చట్టాలుగా స్వీకరించటం తప్ప ప్రజలకు మరో మార్గం లేదు.

ధృతరాష్ట్ర : సరి సరి; మద్యపానంలపై నిషేధం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో నేనా?

సంజయుడు : భారతానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటినుండీ, మహాత్ముని జన్మస్థలమైన

గుజరాత్ రాష్ట్ర ప్రజలు మద్యపాన స్వాతంత్ర్యం కోల్పోవటం జరిగింది. మరికొన్ని ప్రాంతాలలో కూడా కొద్ది కాలంవరకు నిషేధం అమలు చేయడం జరిగింది. ఈ విధానం విఫలం అవటం వలన ఆయా ప్రభుత్వాలకు చెప్పరానంత నష్టాలు ఎదురైతే, ఈ నిషేధాన్ని వాణిజ్యపరంగా ధిక్కరించే వాళ్లకు మాత్రం కోట్లకొలదీ అక్రమ ఆదాయం లభిస్తుంది.

ధృతరాష్ట్ర : భారతంలో ప్రస్తుతం ఎనభై కోట్లకు మించి జనాభా లేదా? భారతమంటే ఒకే దేశం కదా! భారతీయులందర్నీ సమంగా చూడటమే కదా భారత ప్రభుత్వ కర్తవ్యం? నియమాలు, నిబంధనలు, చట్టాలు, న్యాయవిధానాలు అందరిపట్లా ఒకేవిధంగా అమలు జరగాలి గదా? కులమతాల విషయంలో గానీ, ప్రాంతాల విషయంలో గానీ ఎటువంటి విచక్షణా చూపకూడదన్న సంగతి భారత రాజ్యాంగంలో లేదా? మద్యనిషేధం ద్వారా ప్రజల ఆరోగ్య, ఆర్థిక స్థితిగతుల్ని అభివృద్ధి చేయాలని భావిస్తే ప్రాంతాల వారీగా కాక ఈ ఎనభైకోట్ల మంది మేలునూ దృష్టిలో పెట్టుకోవాలి గదా? అట్లా కాక గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఉన్న పది, పదకొండు కోట్లమంది ప్రజల్ని ఉద్ధరించినంత మాత్రాన సరిపోతుందా? ఇట్లా వివక్షతను ప్రదర్శించటమంటే మిగతా డెబ్బై కోట్ల మంది ప్రజల శ్రేయస్సునూ పట్టించుకోవటం లేదన్నమాట. భారతీయులందర్నీ సమంగా చూడకుండా ఈ విధంగా గుజరాత్ వారనీ, ఆంధ్రప్రదేశ్ వారనీ, మహారాష్ట్ర వారనీ, మధ్యప్రదేశ్ వారనీ, విభజించి చూడటం దేశ సమగ్రతకు మంచిదేనంటారా? బాగుచేయాలన్న భావమే ఉంటే సమస్త దేశాన్నీ బాగు చేయాలి. సుఖాలనైనా, దుఃఖాలనైనా ప్రజలందరూ సమంగా పంచుకోగల స్థితి ఉన్నప్పుడే అది ఒక దేశంగా మనుగడ సాగించగలుగుతుంది.

సంజయుడు : మహారా... తమరు చెప్తున్నది అక్షరాలా నిజం. దేశమంతా ఒకటిగా, ఐక్యంగా ఉండాలంటే ప్రజలందరికీ ఒకే విధానం ఉండాలి. అయితే రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయా రాష్ట్ర ప్రజల బాగోగులు చూసే బాధ్యత

మాత్రమే ఉంది. రాష్ట్ర ప్రభుత్వాధినేత అభిప్రాయాల ననుసరించే ఆయా రాష్ట్రాల విధానాలు ఉంటాయి. ఆ విధానాలను తలవొంచుకొని భరించటమే ఆరాష్ట్ర ప్రజల కర్తవ్యం.

ధృతరాష్ట్ర : ఇట్లా చర్చిస్తూ కూర్చుంటే ఏం ప్రయోజనం లేదు. దక్షిణ భారత దేశంలో ఏవో ఆసక్తికరమైన సన్నివేశాలను వినిపిస్తానని చెప్పావుగదా? ఆపని ప్రారంభించు.

సంజయుడు : ప్రారంభించటానికి ముందు ఆంధ్రప్రదేశ్‌లో మద్య నిషేధం విధించే కాలంకంటే కొంచెం వెనక్కు మనం వెళ్ళాల్సి ఉంటుంది మహారాజా... కొందరు మహిళలు మద్య నిషేద ఉద్యమానికి నడుం బిగించారు. దీనికి మద్రాసుకు సమీపంలో ఉన్న నెల్లూరు జిల్లా వనితలే సారధ్యం వహించి శంఖారావం చేశారు.

ధృతరాష్ట్ర : నెల్లూరువారే ఇందుకు పూనుకోవటానికి ప్రత్యేక కారణాలేమైనా ఉన్నాయా?

సంజయుడు : చాలా గొప్ప ప్రశ్న వేశారు మహారాజా; ప్రతి రాజకీయ కార్యకలాపానికి వెనుక ఆర్థికపరమైన ఒక అంశం ఉంటుంది. నెల్లూరు మద్రాసుకు సరిహద్దుల్లో ఉన్న ఒక జిల్లా అని తమకు ముందే మనవి చేశాను. ఈ సరిహద్దుకు ఆవల మద్యం పరవళ్ళు, ఈవల మద్యం హులక్కి. ఈ పరిస్థితి ఉన్నప్పుడు సరిహద్దు వాళ్ళకు ఎంతో లాభదాయకం గదా! మద్రాసు రాష్ట్రంలో మద్యనిషేధం అమలులో ఉన్నప్పుడు, తమ ప్రాంతంలో ఆ నిషేధం ఉండలని నెల్లూరు వాసులు ఎటువంటి ఆందోళనా చేయలేదు. అయితే మద్రాసు రాష్ట్రంలో మద్యనిషేధం అమలులో లేనప్పుడు తమ ప్రాంతంలో మద్యంపై నిషేధం విధించాలని నెల్లూరు వాసులు పట్టుబట్టడంలో ఎటువంటి ఆశ్చర్యం లేదు. మద్యనిషేదం అమలులో ఉన్న ప్రస్తుత తరుణంలో ఈ కారణంగా కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్న కొందరు అక్రమ వ్యాపారస్తులు "భగవంతుడా! ఈ నిషేధం ఇట్లాగే ఎల్లకాలం అమలులో ఉండేట్లు చేయి" అని అహోరాత్రాలు ప్రార్థిస్తూ ఉండటమూ సహజమే. నిషేధం అమలులో లేనికాలం ఎక్సైజ్ వాళ్ళకు కనకవర్షం కురిపించేదైతే, నిషేధం ఉన్న సమయం పోలీసు వాళ్ళకు కావాల్సిన కాసుల పంట పండించేదిగా

జనం చెప్పుకొంటారు. ఇందువలననే చట్టసంరక్షకులైన ఖాకీ చొక్కాల వాళ్లు గూడా ఈ మద్యనిషేధం ఇట్లాగే చిరస్థాయిగా ఉండిపోవాలని కోరుకుంటారు. మద్యనిషేధం విధించిన తర్వాత చాలావరకు, అల్లర్లు, కొట్లాటలు, దోపిడీలు, దొంగతనాలు తగ్గిపోయాయని పోలీసువాళ్ళు వాదిస్తున్నారు. ఈ వాదంలోని యదార్థాన్ని అట్లా ఉంచుదాం. అసలు రహస్యం ఏమిటంటే ఈ రౌడీలు, దొంగలు, దోపిడీదారులు తమ తమ అసలు వృత్తులు మాని అంతకంటే మరింత లాభసాటిగా ఉండే మద్యం రవాణా దొంగ వ్యాపారాన్ని ప్రక్క ప్రాంతాల నుండి నిరాటంకంగా సాగిస్తూ ఉండటమే. అంటే, ఈ దొంగలు రౌడీల కోరిక కూడా మద్యనిషేధం కలకాలం ఇట్లా సాగుతూ ఉండాలనే. కానీ రాష్ట్ర ప్రభుత్వ ఖజానా మాత్రం వేలాదిరూపాయల నష్టంతో బోసిపోతూ ఉంది. రాష్ట్ర ప్రభుత్వ నష్టాన్ని భరించేదెవరు? ప్రజలే గదా! ఏ కాలంలోనైనా నష్టపోయిన వాటిని ప్రజలు మళ్ళీ పొందగలుగుతారా మహారాజా?

ధృతరాష్ట్ర : ప్రజానాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఎటువంటిపనైనా చేయవచ్చున్నమాట! పాత రోజులలో ఒకరాజు తొందరపాటుతో తప్పులేమైనా చేసి, ప్రజలకు నష్టం కలిగిస్తే ఆ తర్వాత పశ్చాత్తాపం చెంది తన తప్పుల్ని చక్కదిద్దుకొని తిరిగి ప్రజాదరణ పొందేవాడు. కానీ నేటి ప్రజాస్వామ్యంలో పాలకులు తమ దోషాల వల్ల ప్రజలకెదురయ్యే దుష్ఫలితాలను వచ్చే ప్రభుత్వాలమీద మోపి వీళ్ళు హాయిగా కాలం గడుపుతారు. ఈ ప్రజాస్వామ్య విధానంలో పాలకులకు తమ బాధ్యతల్ని గుర్తించేటట్లుగా చేయటమనేది ఆ దేవుడు అనుకొన్నా సాధ్యపడదు. సంజయా.... ఈ జుగుప్సాకర రాజకీయాల విషయం ఇహ మాట్లాడ వద్దు. నాకేదో ఒక రసవత్తరమైన ఘటనను వినిపిస్తానని చెప్పావే! ఏమిటది?

సంజయుడు : 1994వ సంవత్సరం అక్టోబర్‌లో ఆంధ్రప్రదేశ్ రాజధాని హైద్రాబాద్ నగరంలో సంభవించిన ఒక సంఘటన నాకెంతగానో నచ్చింది. దీనిని వివరించి చెప్పటానికి నాకు 'మీ అనుమతి కావాలి.

ధృతరాష్ట్ర : ఇంకా నా అనుమతినే నీవు కోరుతున్నావా? ఎంతో సేపట్నుండీ ఆ విషయం వినటానికి నా చెవులు ఆరాటపడుతున్నాయి.

సంజయుడు : అక్టోబర్ రెండవతేది గాంధీ జయంతి. అక్టోబర్ 3 నుండి మళ్ళీ వచ్చే అక్టోబర్ 1 వరకూ గాంధీజీని పూర్తిగా మర్చిపోయినవాళ్ళు, ప్రతి అక్టోబర్ రెండున మాత్రం బాపూజీ ప్రతిమలకు పూలమాలలు వేస్తారు. లౌడ్‌స్పీకర్ ద్వారా ఆరోజు తమ కంఠస్వరాలను విని తామే ఆనందిస్తారు. గత ఏడాది గాంధీజయంతినాడు సికిందరాబాద్‌లో గాంధీ విగ్రహం ముందు అయిదు పదుల వయసు దాటిన నూరు, నూట ఏభైమంది స్త్రీలు సమావేశమవటం జరిగింది. గాంధీ విగ్రహం చుట్టూ ఉన్న ఉద్యానవనంలో ఈ ఆడవాళ్ళు గుంపులుగా గుంపులుగా కూర్చొని కంచి, హిందూపురం, పెద్దాపురాలలో తయారయ్యే పట్టుచీరల గూర్చిఏ గాక పెద్దాపురం వనితల గురించీ ముచ్చటించుకొంటూ కూర్చొన్నారు. ఈ వృద్ధ స్త్రీలలో బాలవృద్ధులుగా తమకు తాము భావించుకొనే కొందరు ఈ మధ్య విడుదలైన తెలుగు, హిందీ సినిమాల విశేషాల గూర్చి చర్చిస్తున్నారు. క్రితంరోజు టొమేటోల ధర చుక్కల్లో కెళ్ళిందని ఒక స్త్రీ చెప్తుండగా, మనుషులకు తప్ప అన్నిటికీ ధరపెరగటం ఈ కాలంలో మామూలేనంటూ మరో స్త్రీ వ్యాఖ్యానించింది. నేటి రాజకీయాల గూర్చీ, రాజకీయ నాయకుల వివాహేతర రాసలీలల గూర్చీ కొందరు స్త్రీలు ఎంతో ఉత్సాహంగా నవ్వుకొంటూ మాట్లాడుకొంటున్నారు. తొమ్మిది గంటల సమయంలో ఈ ఉల్లాస వాతావరణాన్ని భంగపరుస్తూ పానకంలో పుడకల్లా నాలుగైదు వాహనాల్లో పోలీసువాళ్ళు వచ్చి అక్కడకు చేరారు. ఈ వచ్చిన పోలీసులకు స్వాగతం పలుకుతున్నట్లుగా ఆ స్త్రీలు మద్యపానానికి విరుద్ధంగా నినాదాలు చేయసాగారు. తాము విధి నిర్వహణలో ఉన్నప్పుడు మద్యం ముట్టమనీ, అందునా గాంధీ జయంతి రోజున అసలు అంటుకోమనీ, ఈ కారణంగానే తీసుకోవాల్సినదంతా గత రాత్రే సేవించటం జరిగిందనీ కొందరు యువపోలీసులు వయసు మీరినా చూడటానికి ఫర్వాలేదనిపించే కొందరు ఆడవాళ్ళతో సవినయంగా మనవి చేశారు. వయసు మళ్ళిన ఈ స్త్రీలు ఏమిచేస్తారో చూద్దామన్న ఉత్సాహంతో పురుషులేగాక, బాలలు గూడా ఆ చుట్టుప్రక్కల ఉన్న దుకాణాలముందు గుమిగూడారు. ఈ స్త్రీల సౌందర్యాన్ని చూడాలన్న ఆలోచన వాళ్ళల్లో ఎవరికీ లేదు. ఆ ఆడవాళ్ళు అక్కడికెందుకు చేరినట్లు, వాళ్ళు చేయబోయే కార్యక్రమమేమిటి అన్న ఉత్సుకతే ఆ

మగవాళ్ళలో ఉంది. బీరుచుక్క కింద బడితే ఈగలు ముసిరినట్లు, పోలీసువాళ్ళు అక్కడకు రావటం చూసి మరికొందరు ఆసక్తిగా అక్కడకొచ్చి చేరారు. ఆ పోలీసులలో ఒక పెద్ద అధికారి, ఆ ఆడవాళ్ళ నాయకురాలి వద్దకు వెళ్ళి మాట్లాడటం మొదలు పెట్టాడు. పది గంటలకు మంత్రులు కొందరు అక్కడకు వచ్చి, గాంధీ విగ్రహానికి దండలు వేస్తారనీ, ఆ సమయంలో మహిళలందరూ దూరంగా వెళ్ళి నిలబడి కరతాళ ధ్వనులు చేస్తూ తమ హర్షాతిరేకాన్ని తెలియజేయాలనీ, ఆ అధికారి ఆ నాయకురాలితో వినయంగా మనవి చేశాడు. ప్రభుత్వ విధానాలను సమర్థించడానికి తాము అక్కడకు రాలేదనీ, మద్య నిషేధం గూర్చి అక్కడకు చేరామని, ఏది ఏమైనా మంత్రులు వచ్చి గాంధీ విగ్రహానికి దండలు వేస్తే తాము అనుమతించే ప్రశ్నే లేదని ఆమె ఆ అధికారికి నిక్కచ్చిగా తెల్పింది. అతను జీపు వద్దకు వెళ్ళి ఇదే విషయాన్ని వైర్‌లెస్‌లో తన ఉన్నతాధికారులతో వివరంగా చర్చించాడు. ఈ లోపు కొందరు మంత్రుల కార్లు, ఎస్కాట్ కార్లు, పోలీసు వాహనాలు అక్కడికొచ్చి చేరాయి. వీటితో పాటు ఆడవాళ్ళ నినాదాలు గూడా హోరెత్తిపోయాయి. అమాత్యులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొత్త తరహా నినాదాలు మిన్నుముట్టాయి. అక్కడ ఉన్న పోలీసుల్లో పెద్ద అధికారి, అంటే డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, ఆ మంత్రులతో కొద్ది నిముషాలు మాట్లాడటం జరిగింది. తర్వాత ఆ అధికారి అక్కడ ఉన్న తన క్రింది పోలీసు అధికారులకు ఏవో ఉత్తర్వులను ఇవ్వడం జరిగింది. మరుక్షణంలో సముద్ర కెరటాలు విరుచుకుపడ్డట్లుగా ఆ స్త్రీలపై లాఠీ చార్జీ విజృంభించింది. నాలుగైదు నిముషాలలో ఆ ఆడవాళ్ళు పెడబొబ్బలు పెడుతూ రోదిస్తూ, శోకాలు దీస్తూ తలా ఒక దిశకు పరుగులు తీశారు. ఆ పోలీసులు లాఠీలను రోడ్లపై బాదుతూ పెద్ద శబ్దం వచ్చేటట్లు చేస్తున్నారే గానీ, ఆ ఆడవాళ్ళను నిర్దాక్షిణ్యంగా కొట్టే ప్రయత్నం చేయడంలేదు. కాని కొన్ని లాఠీలకు ఆ ఆడవాళ్ల కొన్ని శరీర భాగాల్ని స్పర్శించాలన్న ఆసక్తి అసలే కలగలేదని చెప్పటం మాత్రం సత్య దూరమవుతుంది. భయ విహ్వలురై పరుగులు దీస్తున్న ఆ స్త్రీలు తడబడి క్రిందబడటం, మరుక్షణంలోనే లేచి మళ్ళీ పరుగులు దీయటం, జరుగుతూ ఉంది. వెంటనే లేచే శక్తి లేక నీరసంగా ఉన్న ఆడవాళ్ళ

మీదుగానే లాఠీలు ఝుళిపిస్తున్న పోలీసులతో పాటు, భీతితో దారీ, తెన్నూ గానక పరుగులు పెడుతున్న ఆడవాళ్ళు గూడా ఉండటంతో అక్కడ హాహాకారాలు పిక్కటిల్లాయి. ఈ గందరగోళంలో కొందరు స్త్రీల బట్టలు గూడా అక్కడక్కడ చినిగిపోయాయి. కొందరికి రక్తం కారేట్లుగా గాయాలు తగిలినాయి. ఆ కర్తవ్య పాలకుల దాడి ఆగిపోవటంతో ఆ ప్రాంతంలో స్మశాన ప్రశాంతత ఏర్పడటంతోపాటు, పాదరక్షలు గూడా చెల్లాచెదురుగా పడివున్నాయి. స్త్రీలపై లాఠీచార్జీ జరుగుతూ ఉన్నా అక్కడ షాపుల ముందు గుమిగూడి ఉన్న పురుషులు చప్పట్లేమీ కొట్టలేదు. కానీ, ఆ అమాత్యవర్యులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సందర్భంలో కరతాళ ధ్వనులు చేస్తున్న పోలీసులతో పాటు, వీళ్ళకూ చప్పట్లు కొట్టక తప్పలేదు. మరికొన్ని నిముషాలలో మంత్రులూ, వాళ్ళ ననుసరించి అధిక సంఖ్యలో ప్రజలూ వెళ్ళిపోయారు.

ధృతరాష్ట్ర : సంజయా.... "అక్టోబర్ రెండు" అనే నీ కథ ఇంతటితో సమాప్తమైనదా?

సంజయుడు : కాలేదు మహారాజా! అసలు కథ ఇప్పుడే ఆరంభమవుతుంది. శాంతి భద్రతలను భగ్నం చేయాలనే దుర్బుద్ధితో అక్కడ సమావేశమైన స్త్రీలను అతి తక్కువ బల ప్రయోగంతో చెల్లా చెదురు చేయించటంలోనూ, గాంధీ జయంతి రోజున నిరాటంకంగా మంత్రులతో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేయించటంలోనూ విజయం సాధించిన ఆ డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ చిరుదరహాసంతో కారెక్కబోతున్న సమయంలో....

ఒక అశరీర వాణి ఫక్కున నవ్వినట్లుగా అన్పించింది వాళ్ళకు. అమ్మాయిదో, అబ్బాయిదో గాని ఒక వింతనవ్వు అది... సమాధిలోతుల నుండి వచ్చినట్లుగా ఉంది ఆ నవ్వు.

ఈ నవ్వు ఎక్కణ్నుంచి వచ్చిందీ అని ఆ పరిసరాలన్నీ కలయజూశారు వాళ్ళు. పుష్పమాలలతో నిండి ఉన్న ఆ గాంధీ విగ్రహం నవ్వులతో కంపించిపోతున్నట్లుగా వాళ్లకు కన్పించింది. ఈ కంపన వల్ల నదురు వరకూ పూలమాలలతో కమ్ముకుపోయి ఉన్న గాంధీ ముఖం, ఆ మాలలు జారి స్పష్టంగా కన్పించసాగింది. శరీరమంతా కదిలిపోతున్నట్లుగా గాంధీ తాత తన బోసినోటితో నవ్వుతూ ఉన్నాడు. ఈ దృశ్యం చూసి ఆ డిప్యూటీ కమిషనర్తో పాటు, అతని సిబ్బంది గూడా నిర్ఘాంతపోయారు.

నమ్మలేనట్లుగా కళ్ళు నలుముకొని గాంధీ విగ్రహంవైపు మళ్ళీ చూశారు వాళ్ళు. శరీరమంతా ఊగిపోతున్నట్లుగా యదార్థంగానే నవ్వుతూ ఉన్నాడు గాంధీ. తన సిబ్బందిని అక్కడే ఉండమని చెప్పి, గాంధీ విగ్రహం వద్దకు వెళ్ళాడు డిప్యూటి కమిషనర్. సమీపంగా పోయి చూసినా ఆ బోసి నవ్వు అట్లాగే ఉంది. అత్యంత గౌరవభావంతో ఆ జాతిపితకు సెల్యూట్‌చేసి ఆ డిప్యూటి కమిషనర్ అడిగాడు. "గాంధీమహాత్మా... తమరు నవ్వుతూ ఉన్నారా? తమరు సంతోషించటమంటే మాకూ పరమానందమే. ఏనాడో మమ్మల్ని విడిచి స్వర్గాన్ని చేరారు గదా మీరు? ఇప్పుడు మీ విగ్రహం ఇట్లా నవ్వటం ఏమిటి? తన నవ్వుకు తాత్కాలికంగా బ్రేకులు వేసి గాంధీజీ చెప్పాడు "ఓ శాంతి భద్రతా సంరక్షకా! నిన్ను మించిన ఆశ్చర్యం నాకూ కల్గినేనిట్లా నవ్వుతున్నాను. చూడగూడదు అనుకొన్నవి ఎన్నో చూశాను. వినగూడదు, అనుకొన్నవి ఎన్నో విన్నాను. అయినా ఈ రోజు ఇక్కడ జరిగిన సంఘటనలు ఎంత నమ్మశక్యం గానివి! ఎంత అవిశ్వసనీయమైనవి! అని తలపోస్తూ నేను నవ్వుతున్నాను. మద్యం విషం వంటిదనీ, మానవుడు దానిని చేతితో గూడా ముట్టరాదనీ, నేనానాడే చెప్పాను. అది నా వ్యక్తిగత అభిప్రాయం నన్ను జాతిపితగా గౌరవిస్తున్న నాదేశ ప్రజలు నా అభిప్రాయాలను గూడా ఆదరిస్తారని నేను భావించాను. నా జన్మస్థలమైన గుజరాత్‌లో ఇంతకాలం మద్య నిషేధ నియమం ఎంత చక్కగా అమలు జరిగిందో అన్న విషయం మనసులో నవ్వూ ఏడుపూ కలగలసి వస్తున్నాయి. నా పేరు చెప్పుకొంటూ ఎన్నో అన్యాయాలూ, అక్రమాలు, వంచనలు, కుతంత్రాలు ఈ దేశంలోనే గాక, ఇతర దేశాలలో గూడా జరిగిపోతూ ఉన్న విషయం తెలిసి సంతోషం, సంతాపం సరిసమానంగా పొంగుకొస్తున్నాయి నాలో. ఈ రోజు ఇక్కడ జరిగిన సంఘటనలకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న తర్వాత గూడా నాకు నవ్వురాకపోతే, నేనూ ఒకనాడు ఈ భూమిలో మానవుడుగా సంచరించానన్న సత్యాన్ని సమర్థించటం కేవలం విగ్రహరూపంలో నున్న నాకు సాధ్యమయ్యేపని కాదు. నియమపాలకా... మీరూ ఆలోచించండి... స్వంత గృహాలలో భర్తలకు, పిల్లలకు సవ్యమైన మార్గం చూపలేక విఫలురైన ఈ స్త్రీలు దేశాన్ని ఉద్ధరించటానికి ఉద్యమిస్తూ వీధుల్లోకి వస్తారా? తమ గృహాలను

చక్కదిద్దుకొన్న తర్వాత గదా, ప్రక్క ఇళ్ళ బాగును గూర్చి ఆలోచించేది. మనని మనం సంస్కరించుకొన్న తర్వాతనే ఇతరుల గుణ దోష సంస్కరణకు పూనుకోవాలి. ఇంట గెల్చి కదా రచ్చ గెల్చేది. సరే; ఈ రోజు ఇక్కడ జరిగినదేమిటి? వయసు మళ్ళిన ఈ స్త్రీలు వాళ్ళ స్వంత ఆలోచనలతోనో, లేదా ఇతరుల ప్రోద్బలంతోనో ఈ వృద్ధుని విగ్రహం చుట్టూ చేరారు. సంవత్సరానికొకసారి గాంధీ జయంతి అంటూ నా విగ్రహానికి నాయకులు పూలమాలలు వేయటం, అధిక ప్రసంగాలు చేయటం నాకేగాక, ప్రజలకూ ఎంతో చికాకు కల్గిస్తూ ఉంది. నడిమి వయసు ఈ స్త్రీలు ఈ రోజు ఇక్కడెందుకు చేరినట్లు? నేనెప్పుడో చెప్పిన ఒక విషయాన్ని ప్రభుత్వం విధిగా అమలులోనికి తేవాలని వీళ్ళు వీధులకెక్కారు. ఈ స్వతంత్ర భారతంలో అట్లా చేసే స్వేచ్ఛ వాళ్ళకు లేదా? ఇక, ఈ మంత్రివర్యులు వస్తున్నారు; తమని ఒక్కపైసా అయినా ఖర్చు పెట్టే అవసరం లేకుండా నా ప్రతిమకు పుష్పమాలలు వేసే స్వేచ్ఛ వాళ్ళకు ఉంది. మంత్రులు జరిపే నా జన్మదిన వేడుకల్ని అడ్డగించాలని ప్రయత్నించినా ఈ వయసు మళ్ళిన మహిళల్ని ఇంత నిర్దాక్షిణ్యంగా లాఠీలతో మర్దించటం న్యాయమా? దెబ్బలు తగిలిన బాధలోనూ, తగుల్తాయన్న భయంతోనూ, చెల్లాచెదురై పరుగెత్తుతూ తొట్రుపాటుతో క్రిందపడి మొత్తుకొంటూ అక్కడక్కడ చిరిగిన బట్టలతో ఉన్న ఆ స్త్రీల. అసహాయ స్థితిని పరిశీలిస్తున్న ఆ మంత్రుల ముఖాల్లో ఒక వక్రమైన చిరునవ్వు మొలుచుకు రాలేదా? ఎందరో దేశభక్తులు తమ రక్తం ధారపోసి, ప్రాణత్యాగం చేసి సాధించుకొన్న ఈ స్వాతంత్ర్యానికి అర్థమిదేనా చట్ట సంరక్షకా? అహింసా సిద్ధాంతాన్ని ఆయుధంగా స్వీకరించి అంతులేని పోరాటాన్ని జరిపిన మాత్రానే స్వాతంత్ర్యం ప్రసాదించిన ఆ తెల్లదొరలు ఎంత మహనీయులు? ఈ స్వతంత్ర భారతంలో సత్యాహింసలతో మన ప్రజలు ఏమైనా సాధించగలుగుతారా అన్న ఆలోచన వచ్చినప్పుడు నాకు ఏడుపే వస్తున్నది. సమానత్వం, సహోదర భావం, ప్రజాస్వామ్యం అనే ఆదర్శాలకు ఈ రోజుల్లో ఎవరు ఏపాటి విలువ ఇస్తున్నారు? స్వాతంత్ర్య సాధన అనంతరం ఈ దేశంలో ఒక రామరాజ్య స్థాపన జరుగుతుందని నేను కలలు గన్నాను; ఎదురుతెన్నులు చూశాను. రామరాజ్యం రాలేదు సరే; రావణ రాజ్యంలో

గూడా వినని అధికార దుర్మోహ, పిశాచాల విలయ తాండవాన్ని చూస్తున్నాం నేడు. తెల్లవాళ్ళ తుపాకులకు, ఫిరంగులకు శక్తి లేదనేనా వాళ్ళు నన్ను హత మార్చంది? స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నన్ను సైతం కడతేర్చే స్వాతంత్ర్యం వచ్చిందని నా ప్రియ దేశవాసులూ గ్రహించగలిగారే. నా ఆదర్శాలకు మనసా, వాచా, కర్మణా పాటిస్తామని శపథం చేసిన శిష్యులు నా మరణానంతరం, వాటిని గాలికి వదిలేసి అధికార అంతస్తుల కోసం వీధికుక్కల్లా కొట్లాడుకోవటం లేదా? సంవత్సరంలో మూడు వందల అరవై నాలుగు రోజులూ నా సిద్ధాంతాలతో బాటూ, నన్నూ విస్మరించే నా శిష్య ప్రశిష్యులు, నా జన్మదినమైన ఈ ఒక్కరోజు నాప్రతిమకు దండలు వేసి చిత్తశుద్ధిలేని ఉపన్యాసాలతో ఊదరగొడుతూ ప్రజల్ని వంచించటం లేదా? ఇదాంతా చెప్పి మూతపడ్డ పెదవులు అదురుతూ ఉండగా, గాంధీజీ కన్నుల నుండి అశ్రువులు ధారగా కురువసాగాయి.

మహారాజా.... మహారాజా... తమరు నిద్రబోతున్నారా?.... అయ్యో, మహారాజా...... తమరు కూడా ఏడుస్తున్నారా?

ధృతరాష్ట్ర : నేనేడవటం లేదు సంజయా.... ఈ విషాద గాథవింటుంటే నా గ్రుడ్డి నేత్రాల్నుండి కూడా నీరు కారటం సహజమే కదా సంజయా! కానీ, నేటి భారతంలోని ప్రజానాయకులకు ఎందుకు కన్నీరు రావటం లేదు?

సంజయుడు : ఈ ప్రశ్నకు తగ్గ ప్రత్యుత్తరమిచ్చే జ్ఞానం, యోగ్యత ఈ పేదవాడికి లేదు మహాప్రభో; అనవసరంగా తమని బాధపెట్టినందుకు మన్నించండి నన్ను.

ధృతరాష్ట్ర : నీవెందుకు క్షమను అర్థించాలి సంజయా? అవసరమైన వాళ్ళు అర్థించినా ఆ బోళా శంకరుడైనా దాన్ని ప్రసాదించటం సాధ్యపడుతుందా? పాతకులకు స్థానం ఆపాతాళమేనని చంద్రశేకరుడికీ బాగా తెలుసు.